బతకమ్మ పెద్దనాయుడుగారి తోటలో మామిడిచెట్ల కానుకొని నిలబడింది. రేగిపోయి ముఖంమీద పడుతున్న జుట్టు సందులోంచి కళ్ళు చిట్లించి ఆత్రంగా చూస్తోంది, ఊళ్ళోకి తీసుకుపోయే మట్టి రోడ్డువైపు.

దూరంగా తాటితోపులు, ఆ పైన కారుమబ్బులు, అక్కడెక్కడో పొలాల్లో వరినాట్లు వేస్తున్న కూలీలు, శ్రమను మరచిపోయేందుకు బిగ్గరగా పాడుతున్న పాటల్ని సన్నగా మోసుకొస్తున్న పిల్ల గాలి-ఇవేమీ బతకమ్మ ఆలోచనల దరిదాపుల్లో లేవు

బతకమ్మ ఎండుపుల్లలు ఏరుకోటాని కొచ్చింది తోటలోకి. పసితనాన్ని వదిలి పెద్దరికంవేపు పరుగులు పెడుతున్న వయసు దానిది. పసితనాన్ని వదులుకోలేక పెద్దరికాన్ని పూసుకోలేక ఊగిసలాడుతున్న మనసు దానిది.

దాని వయసుకి నిన్నటివరకూ కడుపులో ఆకలి గురించి మాత్రమే తెలుసు.

కానీ నిన్న మధ్యాహ్నం.

నరాలు జివ్వుమనే ఆకలొకటి ఈ ప్రపంచంలో ఉందని దానికి తెలిసింది. ఆ సంగతి దానికి తెలియజెప్పినవాడు చినబాబు. పెద్దనాయుడుగారి ముద్దుల కొడుకు. పట్నంలో చదువుతున్నాడు.

అతను "సదివేది కాలేజీ సదువనీ," అతను పండిన జాంపండులా పచ్చగా, ఎదిగిన అరటిచెట్టులా ఎత్తుగా అచ్చం "చినేమా హీరోలా" ఉంటాడనీ అతన్ని చూడకముందు, గూడెంలో ఆడాళ్లు నూతిదగ్గర, కాలవగట్టున అంట్లు తోము కుంటూ చెప్పుకుంటూన్నప్పుడు వింది బతకమ్మ.

ఆ తరువాత చినబాబుని తలచుకొన్న ప్పుడల్లా అస్పష్టంగా కళ్లముందు ఓ రూపం మెదిలేది దానికి.

ఆ రూపం తనని చూసి నవ్వినట్లు, ఒకోసారి దగ్గరకు తీసుకుని తల నిమిరి నట్లు, ఇంకోసారి రెండు చేతులతో బుగ్గల్ని తాకినట్లు ఓ స్పర్శలాంటి అను భూతి కలిగేది దానికి. అలాంటి అను భూతి కలిగినప్పుడు మత్తుగా కళ్ళు అరమూతలు పడేవి. పడుకున్న కుక్కి మంచంగానీ, దాంట్లో నల్లులుగాని, అప్పు డెప్పుడో పెద్దనాయుడిగారిచేలోగుక్కెడు గంజినీళ్ళకి డబ్బులకోసం కూలీకెళ్ళి ట్రాక్టరు దున్నుతూ అందులోంచి పడి మాంసంముద్దయి కాలి బూడిదయి పోయిన తండ్రిగానీ, అతని చావుతో తమకి కొత్తగా వచ్చిన కష్టం ఏదీ లేక పోయినా అతన్ని తలచుకుంటూ బాధ పడుతూ తిట్టుకుంటూ పనులు చేసుకు పోయే తల్లి మాటలు గాని దాని కలల లోకాల పొలిమేరలు చేరేవికావు.

సరిగ్గా మధ్యాహ్నం అది అలాగే మంచంమీద పడుకొని ఉండగా తల్లి చీపురుతో కొట్టింది. కల కరగక తప్ప లేదు. కలల మేడలోంచి వాస్తవపు పాక లోనికి వచ్చిపడిన బతకమ్మకి తల్లి తనని చీపురుతో కొట్టినందుకు ఏడు పొచ్చింది.

"నన్ను సంపడానికి పుట్టావే లంజ కానా, పొద్దెక్కిపోయినా అలా తొంగుండి పోతే పొయ్యేలా ఎలిగిస్తా ననుకు న్నావే..." లేచి ఎండుపుల్లలు ఏరుకు రావే . గెంజినీళ్ళన్నా కాస్తాను" అంటూ తల్లి మళ్ళా తనని చీపురుతో కొట్టింది.

"పెళ్ళిచేసి అత్తోరింటికి పంపాల్సిన పిల్లకి పెళ్ళిసైనేవు, అత్తోరింటికి పంప లేవు గాని సీపురుతో కొట్టడం ఒచ్చున్న మాట," అంటూ పాకలోకి అడుగు పెట్టేడు సివాద్రి. "ఇదిగో మరదలా నాతో వచ్చేయ్. నీ నడుం ఓ సేతినీ, సెర్నాకోళా ఓ సేతినీ అట్టుకుని బండి కట్టేనంటే-ఎవద్రా అడు సివాద్రా? కలకట్రా? అదేటది బతకమ్మా-చినేమా హీరోయినా? అని ఆశ్చర్యం అయి పోవాల. నీకు మా అత్త ఇంతే - ఇలా ఎండుపుల్లలు ఏరుకురామంటది. పేద

యువ

నీళ్ల సల్లమంటది. పేద బోగుసేసి పిడ కలు సైమంటది-కూలికెళ్ళి పైసలొట్టుకు రామంటది. కాని పెళ్ళి మాత్తరం సైదు.. " అంటూ వాడు కుక్కిమంచం వైపు అడుగులు వేయబోతే బతకమ్మ కళ్ళు తుడుచుకొని మంచంమీంచి చివాల్న లేచి మూలనున్న తట్ట తీసుకొని వీధిలోకి వెళ్ళిపోయింది, ఎండుపుల్లలు ఏరుకోడానికి.

సివాద్రిని చూస్తే బతకమ్మకి సెడ్డ సిరాకు. ఆడు తాడిలా అంతెత్తుండి గోసీ ఎడతాడు. ఆడికి నున్నగా క్రాపింగ్ తీడం రాదు సరిగదా నెలనెలా గుండు గీయించుకుంటాడు. పిల్చి సున్నపు బొట్లు పెట్టాలనిపిస్తది దానికి "

అదంతా ఒకెత్తు. వాడు బతకమ్మని అదో రకంగా వెర్రిచూపులు చూస్తుం టాడు, అదొక్కటీ ఒకెత్తు.

బతకమ్మకి వాడిచూపులు వికారం తెప్పిస్తాయి. వాడు దానికి పెళ్లవలేదని బాధపడిపోతుంటాడు. దాని తల్లి ఒప్పు కుంటే క్షణంలో పెళ్ళిచేసుకోడానికి సిద్ధంగా వున్నట్లు మాట్లాడతాడు. నిజం గానే తల్లి ఒప్పేసుకుంటే వాణ్ణే కట్టు కోక తప్పదేమో నన్న భయం దాని కుంది.

అది నిన్నటిరోజున ఎండుపుల్లలు ఏరుకోడానికి పాకలోంచి బయటికొచ్చి పెదనాయుడుగారి కొబ్బరితోటలోకి వెళ్ళింది.

పెద్దనాయుడుగారు ఊరి కరణం. ఆయన పూర్వము కూడా కరణంగిరీ చేసి చాకచక్యంతో ఆస్తి కూడబెట్టా రంటారు. పెద్దనాయుడిగారి కొబ్బరి తోటలో కావలసినన్ని ఎండు పుల్లలు దొరుకుతాయి. ఎండు పుల్లలకోసం గూడెం పిల్లలు ఆ తోటనే ఆశ్ర యిస్తారు.

ఎండుపుల్లలే అయినప్పటికీ అవి పేదజనానికి చాలా అవసరమని తెలిసిన పెద్దనాయుడుగారు వాళ్లను తమ తోటలోకి ప్రవేశించడానికి వీలులేకుండా తోటచుట్టూ దడి కట్టారు. ఎండు పుల్లలు ఏరుతూ తోటలో పట్టుబడ్డ ఇద్దరు కుర్రా ళ్ళని చెట్టుకుకట్టి కొట్టించారు. ఆ విధంగా ఆయన తన తోటలో ఎండు చితుకులు ఏరుకోవడం దొంగతనంతో సమానమనీ ఈ అపరాధానికి ఒడిగట్టినవాళ్లు పిల్ల లయినా పెద్దలయినా కఠిన శిక్షకు పాత్రులనీ ఊరి పేదజనానికి చాటి చెప్పారు.

తట్టెడు పుల్లలు దొరికితే రెండు రోజులు పొయ్యిలోకి పుల్లల బాధ తప్పు తుంది, పొయ్యిమీద గిన్నెలోకి వెచ్చాల సంగతి ఎలాగున్నా - అందుచేత పేద జనం పెద్దనాయుడుగారి బెదిరింపుకి లొంగలేదు. దడి విరిచి తోటలోకి దూరి చీకటి వేళల్లో గబగబా పుల్లలు ఏరుకు పోయేవారు. ఆ సంగతీ తెలిసింది నాయుడుగారికి. "పేద వెధవలు మొండి

వెధవలు" అని ఓ నిర్ణయానికొచ్చేశా రాయన ఈ మొండివెధవలు తన తోటలో ప్రవేశించి అమూల్యమైన ఎండు పుల్లలు ఏరుకుపోకుండా చేయాలంటే ఏం చేయాలి? తోటనిండా నిప్పులబాట పరచడమా? కత్తుల బోన్లు ఏర్పాటు చేయడమా? ఘోర భీకర క్రూర మృగాన్ని పెంచడమా? అని పెద్దనాయుడుగారు సుదీర్ఘంగా ఆలోచిస్తున్నారు.

బతకమ్మ పెద్దనాయుడుగారి తోటలోకి అడుగుపెట్టేసరికి రెండు ఎండు మట్టలు, దానితోబాటు ఇన్ని డొలకలూ రాలాయి, బతకమ్మ కోసమే అన్నట్లుగా.

బతకమ్మ మరి ఆలస్యం చేయకుండా డొలకల్ని ఏరి తట్టలో వేసుకుంది. మట్టల్ని కొసలు ముడేసి చేత్తోపట్టుకొని తట్టని చంకలో పెట్టుకొని నాలుగడుగులు వేసింది. "ఎవత్తివే నువ్వు దొంగ ముండా" అన్న కేకకి హడలిపోయి కొబ్బరి మట్టల్ని జారవిడిచేసింది.

ఎదురుగా తోటబైట సైకిలుకి స్టాండు వేసి గన్నేరు కొమ్మ విరిచి బెత్తంలా చేతిలో పట్టుకొని పెద్ద పెద్ద అంగలు వేస్తూ బతకమ్మకేసి వచ్చాడు చినబాబు.

అతను ఎత్తుగా ఉన్నాడు. అమృతంలో ఊరిన వడియంలా అందంగా డబ్బుతో పులిసిన మనిషిలా పొగరుగా ఉన్నాడు.

అతన్నిచూసి బతకమ్మ రాక్షసుణ్ణి చూసినట్టు జడుసుకుంది.

"ఎవరూ చూడకుండా ఎండుపుల్లలు ఏరుకుపోదామని వచ్చావా ... అవక్కడెట్టవే దొంగలంజా" అని అరిచాడు, చినబాబు.

బతకమ్మ వణుకుతున్న చేతుల్తో తట్ట వంపి ఎండుపుల్లల్ని కింద కుప్పగా పోసింది. "అలా కాదు, వాటిని సరిగ్గా పోగుపెట్టు" అని మళ్ళా అరిచాడు చినబాబు

బతకమ్మ వణుకుతున్న చేతుల్తో వాటిని జాగ్రత్తగా ఏరి పోగులు పెట్టింది.

చినబాబు వాటిని మళ్ళా తట్టలోకి ఎత్తమని ఆజ్ఞాపించాడు. "ఆ తట్ట నెత్తి మీద పెట్టుకొని మట్టలు చేతుల్లోకి తీసుకొని ఇంటివేపు పద-దొంగతనం చేసినందుకు శిక్ష. అవి జాగ్రత్తగా మా పశువుల కొట్టంలోకి తీసుకురా" అని గన్నేరు కొమ్మని ఝుళిపించాడు.

బతకమ్మకి కన్నీళ్ళు తిరిగాయి. వంగుని తట్ట చంకన చేర్చుకుని కొబ్బరి మట్టలు చేతుల్లోకి తీసుకుంది. మెల్లగా ఈడ్చుకుంటూ నడుస్తోంది.

దానికి పదిహేడేండ్లకు తక్కువ వయసు ఉండదని కనిపెట్టిన చినబాబు పదిహేడేండ్లకి ఉండాల్సిన అందాలు దానిలో ఉన్నాయో లేవో వెతికి ఉన్నాయని తెలుసుకుని "ఆగు" అన్నాడు.

ఆగిపోయింది బతకమ్మ.

చినబాబు దాని దగ్గరగా వచ్చాడు. దాని కళ్ళల్లోకి చూశాడు.

"నేనెవర్ననుకున్నావే..చినబాబుని" అన్నాడు.

మనసులోంచి చెదిరిపోతున్న రూపాన్ని గబుక్కున గుర్తుకు తెచ్చుకుని తల ఎత్తి చినబాబుకేసి చూసింది బతకమ్మ.

చినబాబు బాగున్నాడు. అచ్చం చినేమా హీరోలాగే ఉన్నాడు. కలలలో తనని చూసి నవ్వినట్టు దగ్గరికి తీసుకున్నట్టు, రెండుచేతుల్తో బుగ్గల్ని తాకినట్టు అనుభూతి కలిగించే చినబాబులాగే ఈ బాబు 'శానా సక్కగున్నాడు' అనిపించింది బతకమ్మకి.

చినబాబు దాని భుజంమీద చెయ్యివేసి దాని చంకలోంచి తట్టతీసి నేలమీద పెట్టాడు. మెల్లగా నడిపించి తాటితోపు చాటుకి తీసికెళ్ళాడు.

భయంతోనే బతకమ్మ యంత్రంలా అతని వెనకే నడిచింది. తాటితోపు చాటుకి ఎవరి దృష్టీ పోదు. దృష్టి పోడా

నికి అసలక్కడికి ఎవ్వరూ రారు. అప్పుడూ రాలేదు.

చాలా కొద్దిసమయంలో బతకమ్మ చినబాబులో కోపాన్నీ, తాపాన్నీ, ఆవేశాన్నీ, కోరికని, లాలిత్యాన్ని. సర్వ మనోవికారాన్నీ చూసింది. అతను లేచి నిలబడ్డాడు.

బతకమ్మ ఇంకా అలాగే పడుకుని ఉంది. చినబాబు సిగరెట్టు వెలిగించి బతకమ్మకేసి చూసి నవ్వాడు చిన్నగా.

బతకమ్మ శరీరంలో అతను అంతకు ముందు అనుభవించిన మాంసం బరువుని తూకం వేస్తున్నట్టుంది ఆ చూపు.

అలా తూకంవేసి తృప్తిచెందినట్టుంది ఆ నవ్వు.

ఆ తరువాత అతను వెళ్ళిపోయాడు.

తోటలో బతకమ్మ మిగిలిపోయింది. తట్టనిండా ఎండుపుల్లలు రెండు కొబ్బరి మట్టలతో- చినబాబు కోరిక తీర్చినందుకు దానికి మిగిలినవి.

తట్ట నెత్తిన పెట్టుకుని మట్టలు చేతుల్లోకి తీసుకుని ఇల్లు చేరేసరికి "ఎండుపుల్లలు ఏరుకురావడానికి నీకు యింత పొద్దయిందా" అంటూ విరుచుకుపడింది తల్లి.

మొత్తాని కెలాగయితేనేం ఆ రోజు పొయ్యి మండి అన్నం ఉడికింది. కలిగిన దాంట్లో ఆకలి తీర్చుకొని మంచంమీద పడుకుంటే నరాలు జివ్వుమంటూ కొత్త ఆకలి ప్రారంభమైంది దానికి.

ఆ మధ్యాహ్నం చినబాబుతో తోట తోపులో...దానికి చిరుచెమట పట్టింది.

ఎండుపుల్లలు ఏరినందుకు దొంగ నన్నాడు, చినబాబు. ఆ తరువాత తనని నిలువునా దోచుకున్నాడు. దొంగని అనలేకపోయిందతన్ని. పైగా మరోసారి చినబాబుని చూడాలనుంది.

అందుకే ఆ రోజు కూడా ఎండుపుల్లలు ఏరుకురాడానికి మళ్ళా పెదనాయడుగారి కొబ్బరితోటలోకి వచ్చింది. బుర్రకి నూనెరాసి నున్నగా దువ్వింది. ఓ గన్నేరు పువ్వుని తల్లో తురిమింది. మాసిన జాకెట్టుని పైటకొంగుతో కప్పేసి పరికిణీ పాదాలమీద జారాడేటట్లు కొంచెం కిందికి కట్టింది. తోటలో మామిడిచెట్టుకానుకొని నిలబడింది.

సరిగ్గా నిన్న ఇదే వేళ వచ్చాడు చినబాబు. ఈ వేళ కూడా తప్పనిసరిగా వస్తాడనిపిస్తోంది మనసుకి. అరగంట అలాగే చెట్టుకానుకొని నిలబడి చూసి చూసి అలిసిపోయినట్లుగా నిట్టూర్చింది. ఎండుపుల్లల తట్ట నెత్తిన పెట్టుకుని కోరికని తోటలో చెట్టుకీ, పుట్టకీ, గాలికి ఒదిలేసి భారంగా అడుగులేస్తూ ఇంటిముఖం పట్టింది.

* * *

ఆ తరువాత కూడా బతకమ్మ చాలా సార్లు పెద్దనాయుడుగారి కొబ్బరి తోటలో మధ్యాహ్నం వేళల్లో ఎండుపుల్లలు ఏరి

ఏరి కోరికను పుట్టకీ, చెట్టుకీ, గాలికీ వదిలేసి బరువుగా ఇంటికి వెళ్ళిపోయేది.

మరి కొన్నాళ్ళకి దాని ఇష్టానిష్టాలతో నిమిత్తం లేకుండా దాన్ని సివాద్రికిచ్చి ముడెట్టేశారు.

సివాద్రి పెదనాయుడు గారింట్లో పాలేరుపనికి కుదిరాడు.

త్వరలోనే పెద్ద పాలేరుగా అతనికి ప్రమోషనొచ్చింది.

పెద్దనాయుడుగారు పోయాక ఆయన ముద్దుల కొడుకు చినబాబు ఆ ఊరికి మోతుబరి అయ్యాడు.

పాలేరు పనిచేసి ఎప్పుడన్నా కొంగు నిండా "కామందులిచ్చారంటూ" ఇంత అన్నం పచ్చడి మెతుకులు మూటగట్టు కొచ్చి ఆప్యాయంగా తింటూ ఉంటాడు, సివాద్రి.

"ఎర్రోడు నా మొగుడు ... ఎంగిలి కూడని ఎరక్కుండా తింటున్నాడు" అనుకుంటుంది బతకమ్మ.

అన్నట్టు దానికి మరి ఐదేళ్ళుపోతే ఎండుపుల్లలు ఏరుకురాడానికి ఊరంతా తట్టమోస్తూ తిరిగే బాధ తప్పుతుంది.

అవును - దానికి కూతురు పుట్టింది.